క్లుప్తంగా

నేడు కోటి దీపోత్సవం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీకామేశ్వరస్వామి

కలికిరి(వాల్మీకిపురం): పట్టణ పరిధిలోని కోనేటి వీధిలో వెలసిన శ్రీలక్ష్మీ కామేశ్వరస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గోనవరం శ్రీనుస్వామి తెలిపారు. భక్తుల కొంగు బంగారమై కోర్కెలు తీర్చుతున్న శ్రీలక్ష్మీకామేశ్వరస్వామి కోటి దీపోత్సవం కార్యక్రమానికి హాజరై శివుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు తప్పనిసరి

కేవీపల్లె : మండలంలోని ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయాధికారి శ్రావణి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడానికి నిర్ణయించారని, డిజిటల్ గుర్తింపు కార్డు పొందడానికి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రైతుల సేవా కేంద్రాల్లో రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని కోరారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబరుతో తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందడానికి డిజిటల్ గుర్తింపుకార్డు ఉపయోగపడుతుందని తెలిపారు.

అశ్వవాహనంపై శ్రీనివాసుడు


అశ్వవాహనంపై సతీసమేతంగా ఊరేగుతున్న శ్రీవారు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, ధనుష్, కృష్ణమూర్తి మంగళవారం స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వ వాహనంపై ఊరేగించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి.

గంగమ్మ ఆలయానికి రూ. లక్ష విరాళం


ఆలయ కమిటీకి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కురబలకోట: మండలంలోని తెట్టు శ్రీ పాలేటి గంగమ్మ ఆలయానికి చింతమాకులపల్లెకు చెందిన శిద్దల ఈశ్వరమ్మ, శిద్దల శివారెడ్డి వీరి కోడలు శిద్దల పుష్పాంజలి, ప్రదీప్‌రెడ్డి రూ.1,00,116 మంగళవారం విరాళంగా అందజేశారు. ఆలయం వద్ద నిర్మిస్తున్న భోజనశాల రేకులు ఇతర సామగ్రి కొరకు ఈ మొత్తాన్ని వినియోగించాల్సిందిగా దాతలు కోరినట్లు ఆలయ కమిటీ ధర్మకర్త పూజారి అంజి తెలిపారు. దాతలను గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా పూలంగిసేవ


పూలంగి సేవలో లక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం: మండల కేంద్రంలో వెలిసిన శ్రీ లక్ష్మీ జనార్దన స్వామి రథోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ఘనంగా పూలంగిసేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారికి తోమాల సేవ, ఉంజల్ సేవ చేసి విశేష అలంకరణ చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

పుల్లంపేట : మండల పరిధిలోని ఎస్.బోటుమీదపల్లి పాఠశాలలో సర్వేజన సేవా సమితి సభ్యులు మంగళవారం కీ.శేలు జనార్దన్ యాదవ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యాసామగ్రితోపాటు పాఠశాలకు 20 ఓల్టు వైర్‌లెస్ స్పీకర్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రభాకర్ రెడ్డి సర్వేజన సేవా సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు శిల్పకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల హామీ అమలయ్యేనా!


బి.కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల

బి.కొత్తకోట: బి.కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభించాలన్నది విద్యార్థుల తల్లిదండ్రుల దశాబ్దాల కల. దీన్ని ప్రారంభించేందుకు ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టినా రాష్ట్ర విభజన ఫలితంగా ఆగిపోయింది. 2014లో సీఎం అయిన చంద్రబాబు కురబలకోట మండలం అంగళ్లులో జరిగిన జన్మభూమి–మాఊరు సభలో డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత తీరిగ్గా 27 నెలలు గడిచాక ఉత్తర్వు జారీ చేయడం అడ్మిషన్లు చేపడితే ఇద్దరంటే ఇద్దరు విద్యార్థులే చేరడంతో డిగ్రీ కళాశాల ప్రారంభంకాకముందే మూత పడింది. అప్పటినుంచి డిగ్రీ కళాశాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

జీఓ ఇచ్చారు.. మరిచారు

అప్పటి సీఎం చంద్రబాబు హామీ మేరకు 2017 మార్చి 21న కళాశాల మంజూరు చేస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ఆదిత్యానాథ్‌దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వు మినహా కళాశాల ఏర్పాటుకు మౌలిక వసతుల కల్పన, ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు చేయకుండానే అడ్మిషన్లు చేపట్టారు. జూన్‌లో నోటిఫికేషన్ మేరకు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలను ఆహ్వానించారు. జీఓ జారీతోనే కళాశాల ప్రారంభమైందన్న భ్రమలను ప్రజలకు కల్పించారు. వారంరోజుల్లో తరగతుల ప్రారంభం అసాధ్యమని తెలిసినా తమ ఘనత అని చెప్పుకునేందుకు హడావుడి చేశారు. జీఓ జారీ అనంతరం ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యాల గురించి పట్టించుకోలేదు. తరగతులు ప్రారంభానికి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నియామకం కోసం చర్యలు చేపట్టలేదు. కళాశాలపై ఎన్నో ఆశలు పెట్టుకొన్న విద్యార్థులకు తీవ్ర నిరాశను మిగిల్చారు. ప్రధానంగా తరగతుల ప్రారంభం కోసం అందుబాటులోని అవకాశాలను పరిశీలించనేలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణకు సౌకర్యాలు కల్పిస్తామని అప్పటి ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నతాధికారులకు లేఖ కూడా ఇచ్చారు. దీనిపైనా పట్టించుకోలేదు. జెడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో అవసరమైన గదులు ఉన్నాయి. దీన్ని కూడా పట్టించుకోలేదు.

వేలల్లో ఇంటర్ విద్యార్థులు

బి.కొత్తకోటకు మంజూరై మూత పడిన డిగ్రీ కళాశాలను ప్రభుత్వం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. ప్రస్తుతం చర్యలు మొదలు పెడితే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి మౌలిక వసతులను కల్పించి ఏర్పాట్లు పూర్తి చేయవచ్చు. కురబలకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాలకు మధ్యలో ఉన్న బి.కొత్తకోట అనువైనది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పెద్ద పట్టణం కావడం, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు వేలల్లో ఉండటంతో ఆ తర్వాత అభ్యసించే డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తే పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. ఆర్థిక ఇబ్బందులు తీరడమే కాక, డిగ్రీ విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తీరుతాయి. దీనిపై ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

రామసముద్రం: భూసమస్యలపై వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల వలన గ్రామాల్లో నేరాలు జరుగుతున్నాయన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ భానుప్రసాద్‌కు సూచించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని తహశీల్దార్‌కు సూచించారు. అనంతరం ఇటీవల మాలేనత్తం పంచాయతీ చింపరపల్లెలో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు


యరప్పగారిపల్లెలో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

నిమ్మనపల్లె : అడవికి నిప్పు పెట్టడం వలన మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని అటవీ శాఖ వాల్మీకిపురం సెక్షన్ అధికారి సుధాకర్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ముష్టూరు పంచాయతీ యరప్పగారిపల్లిలో ఫారెస్ట్ బీట్ అధికారి శోభారాణి, ఏబీఓ హరినాథ్ రెడ్డితో కలిసి వేసవి కాలంలో అడవిలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా అడవికి వెళ్లే పశువుల, గొర్రెల కాపరులు, అటవీ ఉత్పత్తులను సేకరించే గిరిజనులు అడవికి నిప్పు పెట్టడం వల్ల క్రమేణా అటవీ విస్తీర్ణం తగ్గిపోతోందన్నారు. దీనివల్ల ఏటా వర్షపాతం కూడా తగ్గిపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులకు నిప్పు పెట్టే వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ఎఫ్‌బీఓ శోభారాణి, ఏబీఓ హరినాథ్‌రెడ్డి, కొండగాళ్ల రమణ, ప్రజలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

నిమ్మనపల్లె: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు మదనపల్లి రూరల్ సర్కిల్ సీఐ ఏ.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వాటి పురోగతిపై ఎస్ఐ తిప్పే స్వామిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండేలా సిబ్బంది వ్యవహరించాలన్నారు. సమస్యలను తెలుసుకొని, చట్టబద్ధంగా బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఇటీవల మండలంలో పలుచోట్ల కేబుల్ వైర్లు చోరీ జరగడంపై స్పందిస్తూ, నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసామన్నారు. గతంలో ఇటువంటి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి, నిఘా పెంచుతామన్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీలను మరింత పటిష్టం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా దుశ్చర్యను వ్యతిరేకిస్తూ నిరసన


నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మదనపల్లె సిటీ: అమెరికా నుంచి వందలాది మంది భారతీయులని బహిష్కరించి వారిని యుద్ధ విమానాల్లో తీసుకురావడాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం మదనపల్లె పట్టణంలో నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్లు చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లాగా పంపించడం తగదన్నారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా గౌరవంగా చూడాలని నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ అనుసరించిన ఆర్థిక విధానాలు నిరుద్యోగాన్ని పెంచి పోషించడం వల్లే గత్యంతరం లేక భారతీయ యువత వలస వెళ్తున్నారన్నారు. ప్రధానమంత్రి, విదేశాంగశాఖ వెంటనే అమెరికా విదేశాంగశాఖ మంత్రితో చర్చలు జరపాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రీద్, జయ బాబు, సమీర్, నాని,విష్ణు గణేష్ పాల్గొన్నారు.

నేడు కలికిరిలో విద్యుత్ అదాలత్

కలికిరి: కలికిరిలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వ హించనున్నట్లు పీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్.ఎల్. అంజనీకుమార్ హాజరవుతారని, నియోజకవర్గం పరిధిలోని కలికిరి, పీలేరు, కేవీపల్లి, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ మండలాల నుంచి విద్యుత్ వినియోగదారులు హాజరై విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. నక్కలదిన్నె తండాకు చెందిన దొరస్వామినాయక్ భార్య తులసమ్మ (28) కుటుంబ సమస్యల కారణంగా ఇంటి వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

తంబళ్లపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయం ఉద్యోగులు దృష్టి సారించాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి సూచించారు. మంగళవారం కుక్కరాజుపల్లె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై పంచాయతీ కార్యదర్శి అనితను ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అంగన్వాడీలకు రూపొందించిన యాప్ వినియోగంపై వివరించారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె: ఆటో ఢీకొని మహిళ గాయపడిన సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. నెక్కుంది గ్రామానికి చెందిన ఉమామహేశ్వర్ భార్య లక్ష్మీదేవి (42) కూలీపనులకు వెళ్లేందుకు గ్రామసమీపంలో రోడ్డుపక్కన నడిచి వెళుతుండగా ఆటో ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడగా స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. పుంగనూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు


అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన ప్రాంతం

పీలేరు : పీలేరు గామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 72/2లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అత్యంత ఖరీదైన ప్రాంతమైన సర్వే నంబరు 72/2లో సుమారు 2.50 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని గతంలో ఒకరికి కట్టబెట్టారన్న నిర్ధారణతో అప్పటి తహసీల్దార్ ఖాదర్‌షరీఫ్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. అనంతరం ఆ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఆక్రమణదారులు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో స్థానికులు కొందరు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఫిర్యాదు చేశారు. జేసీ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణ దారులను హెచ్చరించారు. అయినా పనులు నిర్మాణ పనులు కొనసాగిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ భీమేశ్వర్‌రావు మాట్లాడుతూ విచారణ నిర్వహించి పూర్తి నివేదిక జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు.

17న బీసీ కులగణన–రిజర్వేషన్లపై సమావేశం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో ఈనెల 17న బీసీ కులగణన -రిజర్వేషన్లపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు తెలిపారు. మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో జరిగే సమావేశంలో బీసీ నాయకులు పాల్గొనాలని కోరారు. మేదర సంఘ నాయకులు సుబ్బు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామసముద్రం: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. ములబాగల్ తాలుకా గూకుంట గ్రామానికి చెందిన బాలరాజు వయస్సు (45) కర్ణాటక రాష్ట్రం నుంచి టెట్రా ప్యాకెట్లను అనుమతి లేకుండా తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.1,930 విలువ చేసే 48 టెట్రా కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయించినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించడం తగదు


మాట్లాడుతున్న రామస్వామి రెడ్డి తదితరులు

సుండుపల్లె : ఈ నెల 2వ తేదీన పుంగనూరులో జరిగిన జనసేన పార్టీ సభలో సుండుపల్లెకు చెందిన జనసేన మహిళా కార్యకర్త పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించడాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుబట్టారు. మంగళవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామి రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రహిమాన్ ఖాన్, సింగల్ విండో మధుసూదన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. విమర్శలు చేసే ముందు తమ స్థాయి ఏంటో తెలుసుకోవాలని వారు హితవు పలికారు. తమ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మండలానికి చెందిన జనసేన పార్టీ వీరమహిళ ఆరోపణలు చేయడాన్ని వారు ఖండించారు. ఎవరి గురించి అయినా ఆరోపణలు చేసే ముందు ముందు వారి గురించి తెలుసుకోవాలని సూచించారు. అలానే పెద్దిరెడ్డి ఆయన కుటుంబంపై ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తాము ఇచ్చిన పత్రిక ప్రకటనలో ఫలానా వ్యక్తి అంటూ ఎక్కడా బహిర్గతం చేయలేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె తనపై దుష్ప్రచారం చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి వాటికి ఏ ఒక్కరూ భయపడరని గట్టిగా ఎదుర్కొంటామని, తమ పార్టీ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే గట్టి సమాధానం చెబుతామన్నారు.

ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు


అరుణాచలం ప్రత్యేక బస్సును ప్రారంభిస్తున్న డీఎం నిర్మల

పీలేరురూరల్ : ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నామని పీలేరు డీఎం పి. నిర్మల తెలిపారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో మాఘమాసాన్ని పురస్కరించుకుని అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసును పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమైందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

రాజంపేట టౌన్ : ఎల్‌ఐసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం రాజంపేట బ్రాంచ్ కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఖాళీలను భర్తీ చేయాలన్న డిమాండ్‌తో ఎల్‌ఐసీ ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిది నెలల్లో 3, 4వ తరగతి ఉద్యోగులు 3,130 మంది వరకు పదవీ విరమణ పొందడం లేదా కాలం చెందారన్నారు. అలాగే చాలా కాలంగా ఖాళీలు భర్తీకి నోచుకోలేదన్నారు. అందువల్ల సిబ్బందిపై పనిభారం రోజురోజుకు పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలానే సాధారణ బీమారంగంలో ఇతర రంగాల్లో ఇచ్చే విధంగా తమ యూనియన్‌కు గుర్తింపును పునరుద్ధరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20వ తేదీ గంటపాటు దేశవ్యాప్తంగా ఎల్‌ఐసీ సిబ్బంది సమ్మె నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం ఉద్యోగులు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ వెంకటసుబ్బయ్యను కలిసి ఖాళీల భర్తీ, యూనియన్ గుర్తింపు అంశాలపై తమ ఆకాంక్షను ఎల్‌ఐసీ సీఈఓకు తెలియచేయాలని వినతిపత్రం సమర్పించారు.

నేటి నుంచి సీటీఎం గంగమ్మ జాతర

- ఏర్పాట్లు పూర్తి
- 120 గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకోనున్న ప్రజలు


నలవీర గంగాభవానీ అమ్మవారు

మదనపల్లె సిటీ: పడమటి ప్రాంతంలోని తొలి జాతరగా పేరొందిన సీటీఎం నలవీర గంగా భవానీ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మదనపల్లె మండలం సీటీఎం–1 కొత్త వారిపల్లె, సీటీఎం–2, గ్రామ పంచాయతీల్లోని 120 గ్రామాల్లో అమ్మవారి జాతర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మదనపల్లె మండలం సీటీఎంలోని నలవీరగంగాభవానీ ఆలయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, గురువారం సిద్దుల భుక్తి, అమ్మవారి ఊరేగింపు, 14న రాత్రి తిరునాల, 15న పగలు తిరునాల జరుగుతాయి. 16న దోపుల తిరునాల, ఎద్దుల పరుష ప్రారంభమవుతుంది. ఈ జాతరకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాల్లోని ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. రాత్రి తిరునాల రోజు చాందిని బండ్ల ఊరేగింపు జరుగుతుంది. దోపు తిరుణాలతో జాతర ముగుస్తుంది. ఐదు రోజుల పాటు ఆలయంలో అమ్మవారు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమిస్తారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన నలవీర గంగాభవానీ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీపీ రెడ్డమ్మ సీటీఎం–1 సర్పంచ్ ఆనంద పార్థసారథి, సీటీఎం–2 సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ తెలిపారు. బుధవారం మిట్టపల్లె నుంచి అమ్మవారికి వస్త్రాలు అందజేసి జాతర ప్రారంభిస్తారు.

ముమ్మరంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ

- తొలి దశలో వాణిజ్య సర్వీసులకు ఏర్పాటు
- సెల్‌ఫోన్ మాదిరిగా రీచార్జి
- నగదు ఉన్నంత వరకే విద్యుత్ వినియోగించుకునే అవకాశం


నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లు

గుర్రంకొండ: అనుకున్నట్లుగానే విద్యుత్ రంగంలో కూడా సెల్‌ఫోన్ల మాదిరిగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. మండలకేంద్రమైన గుర్రంకొండతోపాటు నియోజవర్గంలోని అన్ని మండలాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రయోగాత్మకంగా ముందుగా వ్యాపార, వాణిజ్యసముదాయాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఇవి గత మీటర్ల మాదిరిగా పనిచేస్తాయి. నెలవారీగా బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. నెల పూర్తి కాగానే మీటర్ రీడింగ్ తీయకుండానే ఆ నెలలో వాడిన విద్యుత్ బిల్లు మీటరుకు లింక్ చేసుకున్న సెల్ నెంబరుకు మెసేజ్ వస్తుంది. దాని ఆధారంగా బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వీటి కంట్రోల్ మాత్రం విద్యుత్‌శాఖ ఆధీనంలో ఉంటుంది కాబట్టి బిల్లు చెల్లించకపోతే తక్షణం కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తారు. ఇది విజయవంతం అయితే సెల్‌ఫోన్ మాదిరిగా ముందునే రీచార్జ్ చేయించుకోవాలసి వస్తుంది. ఇక నుంచి ట్రాన్స్‌కో ఉద్యోగులు వచ్చి ప్రతి నెలా మీటర్ రీడింగ్, ఎన్నియూనిట్లు విద్యుత్ వినియోగం చేశారో రీడింగ్ నమోదు చేసి బిల్లులు ఇవ్వడం వంటి ప్రక్రియకు ముగింపు పలకబోతున్నారు.

వింతగా చూస్తున్న ప్రజలు

సెల్‌ఫోన్ టాక్‌టైమ్ ఉన్నంతసేపు మాట్లాడుకొంటామో ఈ మీటర్‌లోనూ విద్యుత్ వినియోగం కోసం వేసిన నగదు ఉన్నంతవరకు మాత్రమే సదరు షాపుగదికి విద్యుత్ సౌకర్యం ఉంటుంది. సిమ్‌లో నగదు అయిపోయిన వెంటే విద్యుత్ సరఫరా ఎవరి ప్రమేయం లేకుండా నిలిచిపోతుంది. ఇకపై భవిష్యత్తులో సెల్‌ఫోన్‌లో ఏవిధంగా అయితే బ్యాలెన్స్ చెక్‌చేసుకొని వినియోగిస్తామో, కరెంటు కూడా అప్పడప్పుడు స్మార్ట్‌మీటర్‌లో చెక్‌చేసుకొని వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును ప్రజలు వింతగా గమనిస్తూ చర్చింకుంటున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ మౌసీన్‌ను వివరణ కోరగా ప్రస్తుతానికి వ్యాపార, వాణిజ్య దుకాణాలకు ఏర్పాటు చేసిన గ్రేడ్–2 మీటర్ల బదులుగా వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు.